① 26.5.2020



సంఖ్య: II/502 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎటిగిటి నమ్మితి నితడు దయానిధి

## శ్రీరాగం

84 ఎటిఁగిటి నమ్మితి నితఁడు దయానిధి
మఱఁగులు మొరఁగులు మరి యిఁకలేవు ॥పల్లవి॥

వేదోద్ధరణుఁడు విశ్వరక్షకుఁడు
ఆదిమూర్తి శ్రీ అచ్యుతుఁడు
సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె
యేదెస మాపాల నితఁడే కలఁడు ॥ఎటిగి॥

పరమపురుషుఁ డాపన్నివారకుఁడు
హరి శాంతుఁడు నారాయణుఁడు
శరణంటి మితఁడు చేకొని కాచెను
తరవాతిపనులఁ దప్పఁ డితఁడు ॥ఎటిగి॥

హృదయాంతరంగుఁడు యీశ్వరేశ్వరుఁడు
ఇదివో శ్రీవేంకటేశ్వరుఁడు
వెదకితి మీతఁడు విడువఁడు మమ్మిఁక
తుదకును మొదలికి దొరకినవాఁడు ॥ఎటిగి॥

**ఉపోద్ఘాతము:**

ఓ భక్తులారా! మేము ఇతనిని యెటిగితిమి, ఆపై ఇతడు అమితదయానిధి అని నమ్మితిమి. మఱగు మొఱగు (చాటుమాటు) మరి ఇక అక్కరలేదు. మేము ఇతనిని బాహాటముగా కొలిచెదము గాక! అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో పల్లవి అర్థంకావటానికి చాలాసేపు పట్టింది. ఇతను వేదములను ఉద్ధరించినవాడు. విశ్వమునకు రక్షకుడు, పరమపురుషుడు, ఆపదలను



Scanned with CamScanner

నివారించువాడు, అచ్యుతుడు, శాంతమూర్తి, నారాయణుడు, హృదయాంతరంగుడు, ఈశ్వరేశ్వరుడు, అన్నీ ఈయనే. అంతెందుకు ఇతడే శ్రీవేంకటేశ్వరుడని గ్రహించి ఇతనికి శరణంటిమి అంటున్నారు. ఇతనిని విడువము. తుదకు మొదలికిని దొరికినవాడు అంటే ఏమిటి? ఆలోచించండి.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! ఎటిగితి (ఇతని నెటిగితిమి). ఆపై ఇతనిని నమ్మితిమి. ఇతడు దయానిధి అని తెలిసికొంటిమి. మరి ఇక మఱుగులు మొరగులు (చాటుమాటు వ్యవహారాలు) మాకు లేవు.

ఇతడు, వేదోద్ధరణుడు (వేదములను ఉద్ధరించినవాడు). విశ్వరక్షకుడు (సదా ఈ విశ్వమును రక్షించెడివాడు). ఆదిమూర్తి (పురాణపురుషుడు) శ్రీ అచ్యుతుడు (ఎన్నడూ అంతములేనివాడు). ఇతనిని శోధించి తెలిసికొని కొలిచితిమి. సుముఖుడై (అనుకూలుడై) మమ్మేలినాడు. ఇప్పుడు యెటువైపు చూచినా మాపాలిట ఇతడే కలడు ఇది మా భాగ్యము.

అంతేకాదు, యీతడే పరమ పురుషుడు (పరబ్రహ్మ), ఆపన్నివారకుడు (ఆపత్తును నివారించువాడు) శ్రీహరి. పరమశాంతమూర్తి, శ్రీమన్నారాయణుడు. ఈ విధముగా నితనిని తెలిసికొని మేము శరణంటిమి. వెంటనే ఇతడు మమ్ము చేకొని (ఆదరించి) కాచినాడు (రక్షించినాడు). తరవాతి పనులు (శరణాగతరక్షణ, మోక్షమునొసగుట) వంటి కార్యక్రమమును ఇతడు తప్పడు.

ఈతడే హృదయమున అంతర్యామియై, అంతరంగుడుగా వుంటాడు. ఇతడు ఈశ్వరునికే యేలిక. ఇదిగో ఈయనే శ్రీవేంకటేశ్వరుడు ఈతనిని వెదకి కనుగొంటిమి. ఇకపై మేము ఇతనిని విడువము. తుదకును మెదలికి దొరకనివాడు (ఆద్యంతములు కనుగొనలేనివాడు) ఈ మహానుభావుడే.

**పద్యవివరణ:**

కం॥ **ఇతడు దయానిధియనినే**
**హితవుగనెటిగితిని హరిని ఇకనమ్మితిబో**
**ఇతనికి మఱుగులు లేవిక**
**చతురుడ ఓ వేంకటేశ! సప్తగిరీశా!**



Scanned with CamScanner

(2) 26.5.2020



## 1-24

### మున్నుడి

భగవద్గీతను పాట రూపంలో ఏకొందరో దైవాంశ సంభూతులు మాత్రమే చెప్పగలరు. నందకాంశమున బుట్టిన అన్నమాచార్యుల వారికిది ఉగ్గుతో నేర్చిన విద్య

భగవద్గీతలో తలమానికమైన పురుషోత్తమ ప్రాప్తి యోగంలోని సారాంశాన్ని ఇంత అలవోకగా పాడటం అసామాన్యం. భగవద్గీతపై ఆచార్యులవారు చాలా కీర్తనలు చెప్పి ఉంటారు. మన కొరనోముల వల్ల ఈనాడు మనకవన్నీ లభ్యమగుట లేదు. లభ్యమైన ఇటువంటి అరుదైన గీతామృతం చవిచూడకపోతే, "పుట్టురాద నరులు పులుగువోలె" అనిపిస్తుంది. భోజన సమయంలో పురుషోత్తమ ప్రాప్తియోగం పారాయణ చేస్తే 'వైశ్వానరునై' నేను ఆహారం అరగింప చేస్తానన్నాడు స్వామి. కనీసం ఈకీర్తన పాడితే అదే ఫలితం దక్కుతుంది కదా!

**తే॥ క్రీడికందించినట్టి శ్రీకృష్ణబోధ**
**నింత సులువుగ అన్నమయ్యెటుల తెలిపె?**
**వేంకటేశుడు తోడౌట వెనుక జేరి**
**ఏమి భాగ్యము? నేర్పుడీ స్వామి 'గీత'.**

**రాగం : లలిత**

అనియాన తిచ్చెగృష్ణు-డర్జునునితో
వినియాతని భజించు-వివేకమా ॥అని యానతి॥

భూమిలోను చొచ్చి సర్వ-భూతప్రాణుల నెల్ల
ధీమసాననే మోచేటి- దేవుడ నేను
కామించి సస్యమును- గలిగించి చంద్రుడనై
తేమల బండించేటి- దేవుడ నేను ॥అని యానతి॥

దీపనాగ్నినై జీవ- దేహముల యన్నములు
తీవుల నరగించేటి- దేవుడ నేను
ఏపున నిందరిలోని-హృదయములోన నుండి
దీపింతు దలపు మరుపై-దేవుడ నేను ॥అని యానతి॥



Scanned with CamScanner

వేదములన్నిటి చేతా-వేదాంత వేత్తలచేతా
అది నేనెరగ దగిన-యా దేవుడను
శ్రీదేవితో గూడి-శ్రీవేంకటాద్రి మీద
పొదైన దేవుడను-భావించ నేను ॥అని యానతి॥

## భావామృతం

ఇక్కడ 'అని' ఆనతిచ్చెను అంటే ఆ విధంగా చెప్పెను-ఒక అర్ధమైతే,యుద్ధభూమిలో పరమాత్మ ఆజ్ఞాపించాడని ఇంకొక అర్ధం చెప్పుకోవచ్చు. అర్జునునితో శ్రీకృష్ణపరమాత్మ ఉపదేశించాడు. అది విని ఆ స్వామిని భక్తితో భజించుటే తగిన వివేకము సుమా!

ఓ అర్జునా! నేను భూమియందు సమస్త జీవకోటిని నా ఓజో బలముచే (ధైర్యముగా) ధరించుచుయుంటిని. అట్టి దేవుడను నేనే సుమా! నేనే చంద్రుడి వలె రసములతో నింపి ఓషధులను జేసి రకరకములైన పంటలను పండించి జీవకోటికి ఆహారము నొసగుచున్నాను. అట్టి దేవుడను నేనే సుమా!

ఓ పార్థా! జఠరాగ్ని వలె (వైశ్యానరుని వలె) నేను సమస్త జీవులు భుజించిన ఆహరములను జీర్ణింపచేయు దేవుడనైయున్నాను. వాటి హృదయములందు నేనే స్థితుడనైయున్నాను. అట్లు విజృంభించియుండి వారిలో జ్ఞాపక శక్తివలెను మరియు మతిమరుపు కూడ కలిగించు దేవుడనైయున్నాను.(మఱుపులేనిచో కలిగిన తొలినాటి దుఃఖమునే తలపోయుచు జీవులు నశించిపోతాయి)

ఓ సవ్యసాచీ! సమస్త వేదముల చేతను వేదాంత వేత్తల చేతను పూర్వం గ్రహించదగిన దేవుడను నేనే . శ్రీవేంకటాద్రి పై శ్రీదేవితో స్థిరపడినట్టి దేవుడు వేరెవరో కాదు, నేనే సుమా! (భావయామి వేంకటేశం అంటే ఈకీర్తనే......)



Scanned with CamScanner